క్లుప్తంగా

కలెక్టర్‌కు పాస్టర్స్ ఫెడరేషన్ అభినందన



కలెక్టర్ వెట్రిసెల్వికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఇటీవల ఏలూరు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెట్రిసెల్విని మంగళవారం ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ పి.జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు సంఘ నాయకులు కలెక్టర్‌ను కలిశారు. క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేయాలని, క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీపీఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు జాన్ పీటర్, డాక్టర్ పీపీఎస్ కిరణ్, చిక్కాల జోసఫ్, ఎస్ఎల్ పాల్, రాష్ట్ర, జిల్లా నాయకులు ఉన్నారు.

అభయాంజనేయుడి సేవలో ఏలూరు ఎంపీ మహేష్



ఎంపీ మహేష్‌కుమార్‌కు స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ ఈఓ శ్రీనివాస్

హనుమాన్ జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానాన్ని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ మంగళవారం సందర్శించారు. తొలిసారి లోక్ సభ సభ్యుడిగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత అభయాంజనేయ స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. హనుమంతుడికి విశేష పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కూచిపూడి శ్రీనివాస్, అర్చకులు ఆయనకు స్వామి వారి శేషవస్త్రాలు, చిత్రపటం బహూకరించారు. తొలుత సాదర స్వాగతం పలికారు.

వరాహావతారంలో జగన్నాథుడు



వరాహావతారంలో జగన్నాథుడి దర్శనం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర దత్తత ఆలయమైన లక్ష్మీపురం సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం జగన్నాథుడు వరాహావతారంలో సాక్షాత్కరించారు. జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. శంకు చక్రాలను ధరించి, అమ్మవారితో ఆసీనులై ఉన్న స్వామివారు భక్తులకు కనువిందు చేసింది. భక్తులు స్వామివారిని దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతంలో విషజ్వరాలు ప్రబలకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు తెల్లం రామకృష్ణ కోరారు. బుట్టాయగూడెంలో సీపీఎం మండల కమిటీ సమావేశం మంగళవారం కోర్సా జలపాలు అధ్యక్షతన నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాలకు గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయని అన్నారు. వీటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. టైఫాయిడ్, మలేరియా టెస్టులు చేసి గిరిజనులకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అందుగుల ఫ్రాన్సిస్, పోలోజు నాగేశ్వరరావు, నాగమణి, వీరయ్య, రాజు, వెంకటలక్ష్మి, బుల్లెమ్మ, నరేంద్ర పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం



డ్రగ్ ఫ్రీ జిల్లా ఏర్పాటుకు సహకరించాలని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వినియోగం ప్రాణాంతకమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ మెంబర్ జె.రాజేంద్ర ప్రసాద్ సూచించారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో స్థానిక సీఆర్ రెడ్డి ఫార్మసీ కళాశాల, ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో మంగళవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగంపై వ్యతిరేక ప్రచార వారోత్సవాల్లో భాగంగా డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్ నిర్వహించారు. విద్యార్థులు అందరు నేను డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో అని ఉత్సాహంతో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నార్కోటిక్ డ్రగ్స్, ఎన్‌డీపీఎస్ చట్టం మాదకద్రవ్యాల నేరాలను చాలా తీవ్రంగా చూస్తుందని, మాదకద్రవ్యాల నేరాల్లో శిక్ష, జరిమానా రెండు కూడా కఠినంగా ఉంటాయని వివరించారు. సీఆర్ రెడ్డి ఫార్మసీ కళాశాల కరెస్పాండెంట్ రాజా రామ్మోహనరావు మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుంచే మాదకద్రవ్యాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మాదకద్రవ్యాలు జీవితాన్ని ఎటువంటి పతనావస్థకి చేరుస్తాయో ముందుగానే తెలుసుకొని సక్రమమైన మార్గంలో జీవించాలని సూచించారు. నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ కె.ప్రియాంక మాట్లాడుతూ జూన్ 24 నుంచి జులై 10వ తేదీ వరకు ఏలూరు పరిసర ప్రాంతాల్లో డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్ విద్యార్థులతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీలో గెలుపొందిన విజేతకు రూ.5 వేలు నగదు బహుమతి అందజేస్తామన్నారు. అనంతరం ఏలూరు జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా ఉంచడానికి అందరూ సహకరించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఆర్ రెడ్డి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరేంద్ర బాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె.శైలజ, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వరావు, అధ్యాపకులు, నవజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్లు ఎస్ జాకబ్ రాజు, ఒ.నజ్మా, డి.విజయరాణి, ఇ.వెంకటేశ్వరావు, వి.జయపాల్, జె.జ్యోతి చంద్రిక, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు



ఎస్ఎస్‌డీ బయో సైన్సెస్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు



విజయరాయిలో నూజివీడు సీడ్స్ కంపెనీలో తనిఖీలు చేస్తున్న అధికారులు

దెందులూరు: మండలంలోని గోపన్నపాలెం పంచాయతీ శివారు ప్రాంతంలోని ఎస్ఎస్‌డీ బయోసైన్సెస్ (లిక్విడ్ బయో ఫెర్టిలైజర్స్ తయారీ యూనిట్)ను మంగళవారం విజిలెన్స్ స్పెషల్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. లిక్విడ్ బయో ఫెర్టిలైజర్స్ తయారీ యూనిట్‌కు సంబంధించి తనిఖీ అంశాలను అడిగి తెలుసుకున్నారు. యూనిట్ లోపలి తయారీ భాగాలను పరిశీలించారు.

విజయరాయిలో..

పెదవేగి మండలం విజయరాయి గ్రామంలో నూజివీడు సీడ్స్ కంపెనీలో మంగళవారం అమరావతి నుంచి వచ్చిన స్పెషల్ స్క్వాడ్ అధికారులు వి.అజయ్ ప్రసాద్, విజిలెన్స్ ఏఈ విల్సన్, ఏడీఏ వై.సుబ్బారావు, పెదవేగి ఏఓ ప్రియాంక, టెక్నికల్ ఏఓ వెంకటేశ్వర్లు తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్‌ను, లైసెన్స్ గ్రౌండ్ బ్యాలెన్స్, విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్లు, స్టాక్, గ్రోయర్స్ లిస్టు, ఇన్‌వాస్ పుస్తకం తనిఖీ చేశారు. డోర్ నెంబర్స్‌కు సంబంధించి కంపెనీకి పలు సూచనలు చేశారు.

ఘనంగా టైలర్స్ డే



ద్వారకాతిరుమలలో విలియమ్స్ హోవే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టైలర్లు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో మంగళవారం టైలర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక సూర్య టైలర్ షాప్ నందు కుట్టుమెషీన్ సృష్టికర్త విలియమ్స్ హోవే చిత్రపటానికి పలువురు టైలర్లు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు హోవే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టైలర్లు నేలటూరి సత్యనారాయణ, జంగం లక్ష్మణరావు, షేక్ పెంటు సాహెబ్, ఎడ్లపల్లి శ్రీనివాస్, ఎండ్రపాటి మోజేష్, తమ్మిశెట్టి వెంకటరమణ, ఎడ్లపల్లి నటరాజ్, సవరం వాణిదుర్గ, గుడివాడ అంజలి దేవి, వర్థినీడి రంగ నాగలక్ష్మి, అరుణ తదితరులున్నారు.

ఆషాఢం.. అన్నింటా ప్రత్యేకం

- వర్షాలు ఆరంభం.. వ్యవసాయానికి శుభారంభం
- తొలి పండుగ ఈ నెలలోనే ప్రారంభం



గిరిజన ప్రాంతంలో బోనాల జాతర నిర్వహిస్తున్న దృశ్యం



వర్షాకాలం ప్రారంభం కావడంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన ఓ రైతు

బుట్టాయగూడెం: ఆచార వ్యవహారాలకు పెద్దపీట వేసే సనాతన హైందవ సంప్రదాయంలో ప్రతినెలా ప్రత్యేకత సంతరించుకున్నదే. తొలకరి జల్లులతో ప్రకృతి పచ్చని శోభను సంతరించుకునే వేళ అరుదించే ఆషాఢ మాసం కూడా అనేక విశేషాలు ఉన్నదే. చంద్రగమనంలో పూర్వాషాఢ నక్షత్ర సమీపంలో సంచరించే సమయం కాబట్టి ఆషాఢ మాసంగా పిలుచుకుంటారు. శుభకార్యాలకు అవకాశం లేకున్నా ఆధ్యాత్మికంగా ఎన్నో ప్రత్యేకతలు కలిగి ఉన్న ఆషాఢమాసం ఈ నెల 6వ తేదీన ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏ శుభకార్యాలూ చేసేందుకు వీలులేదని భావించే ఈ మాసం నిజానికి ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంది. తొలి ఏకాదశి, గురుపౌర్ణమి, చాతుర్మాస వ్రతాలు, ప్రసిద్ధ జగన్నాథ రథయాత్రలు ఈ మాసంలోనే జరుగుతాయి. అలాగే ఈ ఆషాఢమాసంలోనే గిరిజన ప్రాంతంలో బోనాల జాతరను కూడా జరుపుకుంటారు. అలాగే గుబ్బల మంగమ్మ గుడి వద్ద కూడా అనేక మంది బోనాలు ఎత్తుకుని గుబ్బల మంగమ్మకు సమర్పిస్తారు.

శుభకార్యాలకు దూరం

ఆషాఢమాసాన్ని పూర్వీకులు శూన్యమాసంగా భావిస్తారు. ఈ మాసంగా సాధారణంగా శుభకార్యాలు నిర్వహించరు. ఆషాఢంలో గృహప్రవేశం, నిశ్చితార్థం, వివాహం, ఉపనయనం, తదితర శుభకార్యాల నిర్వహణ అనువుగా ఉండదని భావిస్తారు. ఈ మాస ప్రారంభ సమయానికి వర్షాలు విరివిగా కురుస్తుంటాయి. వ్యవసాయ సాగు పనులు కూడా జోరుగా జరుగుతుంటాయి. ప్రతి ఒక్కరూ వ్యవసాయ పనిలోనే నిమగ్నమవుతున్నందున శుభకార్యాలకు తావు ఉండదు.

కొత్త దంపతులకు ఎడబాటు

కొత్తగా వివాహం చేసుకున్న దంపతులను ఆషాఢ మాసంలో దూరంగా ఉంచే సంప్రదాయం అనాదిగా వస్తుంది. ఇంటిల్లపాది పంటల సాగు పనిలో తీరికలేకుండా ఉంటారు. కాబట్టి కొత్త అల్లుడికి మర్యాదలు చేసే వీలు ఉండకపోవడం ఒక కారణంగా చెప్పవచ్చు. కాగా నవ దంపతులు సంసారిక జీవనం ఫలితంగా గర్భధారణ జరిగితే ప్రసవ సమయం వచ్చే ఏడాది ఏప్రిల్, మే నెలలో ఉంటుంది. తీవ్రమైన ఎండాకాలం కాబట్టి తల్లీ బిడ్డల ఆరోగ్యానికి మంచిది కాదని ఆషాఢమాసంలో నవ దంపతులను ఈ నెల రోజులపాటు ఎడంగా ఉంచుతారు.

సాగు రైతులు సీసీఆర్‌సీ కార్డులు పొందాలి



సీసీఆర్‌సీ కార్డులపై సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ అద్దయ్య

పోలవరం రూరల్: సాగు రైతులు వారి వివరాలను వీఆర్వో, ఆర్ఎస్‌కే సహాయకులకు తెలియజేసి సీసీఆర్‌సీ (పంట సాగుదారుల హక్కు పత్రం) పొందాలని జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె.అద్దయ్య తెలిపారు. పోలవరం రెవెన్యూ కార్యాలయంలో మండలంలోని వీఆర్ఓ, వ్యవసాయ శాఖ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆర్డీవో అద్దయ్య మాట్లాడుతూ వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతూ వారి వివరాలను తెలియజేసి సీసీఆర్‌సీ కార్డులు పొందాలన్నారు. కార్డు కాలపరిమితి 11 నెలలు ఉంటుందని, కార్డు పొందడం వల్ల మద్దతు ధర, పంట రుణం, పెట్టుబడి రాయితీ, ఇన్సూరెన్స్ పథకాలు సాగుదారులకు అందుతాయన్నారు. భూ యజమానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని, సాగుదారుడికి పంటకు మాత్రమే అర్హత కల్పిస్తుందన్నారు. గతంలో సీసీఆర్‌సీ కార్డు ఉన్న వారు దరఖాస్తుతో పాటు సీసీఆర్‌సీ కార్డు జిరాక్స్ జతచేస్తే రెన్యువల్ చేస్తామని, నూతన సాగుదారులకు నూతన కార్డులను అందిస్తామని తెలిపారు. ఈ నెల 11, 12వ తేదీల్లో సమీప రైతు సేవా కేంద్రంలో గ్రామసభలు నిర్వహించి, సాగుదారులను గుర్తించి, సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయడం జరుగుతుందన్నారు. కావున మండలంలోని రైతులందరూ సమీప రైతు సేవా కేంద్రాలకు వెళ్లి సీసీఆర్‌సీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్; వ్యవసాయాధికారి కె.రాంబాబు, రైతులు, వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు



గోదాంలో ఎరువుల స్టాకును పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ద్వారకాతిరుమల: తిరుమలంపాలెం పంచాయతీ పరిధిలోని పావులూరివారిగూడెంలో గోద్రెజ్ ఆగ్రోవెట్ సమాధాన్ ఎరువుల దుకాణాన్ని మంగళవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఎరువులకు సంబంధించిన ఒరిజినల్ ఇన్‌వాయిస్‌లు లేకపోవడాన్ని గుర్తించిన అధికారులు రూ.20,80,358 విలువైన ఎరువులకు స్టాప్ సేల్స్ నోటీసు ఇచ్చారు. మండలంలో మరి కొన్ని ప్రైవేట్, సొసైటీ దుకాణాల్లో ఎరువుల గోడౌన్లపై తనిఖీలు చేపడతామని, నాసిరకం మందులు విక్రయించడం, ఖచ్చితమైన తూకం లేకపోవడం, రైతుల నుంచి అధిక ధరలు వసూలు చేయడం వంటి వాటికి పాల్పడే డీలర్ల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో స్క్వాడ్ ఏడీఏ జగదీశ్వర్‌రెడ్డి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ టి.నాగవెంకటరాజు, ఏలూరు టెక్నికల్ ఏఓ ప్రవీణ్, మండల వ్యవసాయాధికారి ఎ.దుర్గా రమేష్ తదితరులున్నారు.

సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు



శిక్షణా తరగతులనుద్దేశించి మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు

కుక్కునూరు: సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నెమలిపేట గ్రామంలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల నుంచి 200 మంది పార్టీ కార్యకర్తలు పాల్గొన్నట్లు ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు ఎస్‌కే గౌస్ తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో పార్టీ నిర్మాణం, పని విధానంపై కార్యకర్తలకు వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా కేంద్ర కమిటీ నాయకులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు భారతదేశ ప్రపంచ రాజకీయ ప్రస్తుత పరిస్థితులపై శిక్షణ నిర్వహించారు. పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, డివిజన్ సెక్రటేరియేట్ సభ్యులు కట్టం వీరాస్వామి, నాయకులు కెచ్చల రంగారెడ్డి, గెడ్డల ముత్యాలరావు, బానిసేని సత్యనారాయణ, నాలుగు మండలాల కార్యదర్శులు, పీవోడబ్ల్యూ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణకు రైతులు సహకరించాలి

టి.నరసాపురం: భూమిలో ఉన్న పోషకాలను తెలుసుకుని తదనుగుణంగా ఎరువులు, పురుగుమందుల వినియోగం జరగాలని ఏవో బి.సుమలత అన్నారు. ఈ నేపథ్యంలోనే మండలంలో ఎంపిక చేసిన పొలాల్లో మట్టి నమూనాలను సేకరిస్తున్నామన్నారు. మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల్లో 560 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం కాగా, ఇప్పటివరకు 389 నమూనాలు సేకరించామన్నారు. మిగిలిన నమూనాలు త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. సేకరించిన నమూనాలను గొల్లపూడిలోని భూసార పరీక్ష కేంద్రానికి పంపనున్నట్లు తెలిపారు. నమూనాల ఫలితాలు అనంతరం రైతులకు సాగు చేసే పంటలు, ఎరువుల వినియోగం గురించి తెలియజేస్తామని ఏవో తెలిపారు. కాగా, మట్టినమూనాల సేకరణకు రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వాణిజ్య పంటల సాగుతో రైతులకు ఆర్థిక లాభం



గిరిజన రైతులకు పసుపు విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: వాణిజ్య పంటల సాగుతో రైతులు ఆర్థిక లాభం పొందవచ్చని సీటీఆర్ఐ ఆర్ఎస్ జీలుగుమిల్లి హెడ్ డాక్టర్ వైపీ సుబ్బయ్య అన్నారు. జీలుగుమిల్లిలో గిరిజన, దళిత ఉపప్రణాళికలో భాగంగా వాణిజ్య పంటలపై రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ ఆదేశాల మేరకు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తర ప్రాంత తేలిక నేలలకు అనువైన వాణిజ్య పంటలు, వాటి సాగు విధానాలు, వివిధ రకాల వాణిజ్య పంటల ద్వారా లభించే ఆర్థిక లాభాలు, పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కలిగించారు. వాణిజ్య పంట మార్పిడి విధానం, పశుసాగులో వివిధ దశలను వివరించారు. అనంతరం 160 మంది ఎస్సీ, ఎస్టీ రైతులకు పసుపు విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీటీఆర్ఐ శాస్త్రవేత్త ఎస్.వెంకటేషన్, ఫార్మ్ మేనేజర్ టి.వెంకటేష్, టి.రమేష్, సీహెచ్ సుధాకర్‌బాబు, వై వెంకటేశ్వరరావు, బి.దుర్గారావు, జీఎమ్ఎస్ అన్నపూర్ణ, డి.దేనానంద్, తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ వ్యవసాయ భూముల కౌలుకు వేలం

కొయ్యలగూడెం: దేవదాయ వ్యవసాయ భూముల కౌలుకు మంగళవారం మదన గోపాలస్వామి ఆలయ ఆవరణలో వేలంపాట నిర్వహించారు. ఏలూరు గ్రూప్ టెంపుల్స్ ఈఓ సాంబశివరావు, కొయ్యలగూడెం గ్రూప్ టెంపుల్స్ ఈఓ షణ్ముఖం గ్రామస్తుల సమక్షంలో ఈ వేలం జరిగింది. గోపాలపురం రోడ్డులో ఎస్సార్ పెట్రోల్ బంకు పక్కన ఉన్న దేవదాయ శాఖ 6.13 ఎకరాల పొలాన్ని రూ.1.30 లక్షలకు కేహెచ్‌పీ దుర్గాప్రసాద్ వేలంలో దక్కించుకోగా మల్లోలు పొలాలలో ఉన్న 6.25 ఎకరాల భూమిని రూ.2.38 లక్షలకు కోన దయరాజు వేలంలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో మదన గోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్ మద్దు గోపాలకృష్ణ, సర్పంచ్ ముప్పిడి విజయ్ కుమారి, రాచూరి మదన్ నీలం రాంబాబు, సిబ్బంది పార్థసారథి, పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడండి

కొయ్యలగూడెం: ప్రజలకు అండగా నిలుస్తూ వారి సమస్యలపై పోరాటంలో ముందుకు సాగాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు కొయ్యలగూడెం వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. మంగళవారం తాడేపల్లిలో వైఎస్ జగన్‌ను కలుసుకున్న సందర్భంగా పోలవరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఓటమికి గల కారణాలను ఆయనకు వివరించినట్లు వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు తెలిపారు. రాష్ట్ర యువజన విభాగం నాయకులు కరాటం కృష్ణస్వరూప్, జిల్లా విద్యార్థి విభాగం నాయకులు దండాబత్తుల ఖగేన్‌లతో కలిసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలు చేసే విధంగా ప్రజలతో కలిసి పోరాడే సమయం త్వరలోనే రానుందని, ఇందుకు శ్రేణులు సమాయత్తం కావాలని అధినేత సూచించారని పేర్కొన్నారు. కూటమి అరాచకాలు గురించి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై జరుగుతున్న దాడుల గురించి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు.

బ్యారన్‌కు రూ.9 లక్షల రుణం ఇవ్వాలి



బ్యాంక్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న వర్జీనియా రైతు సంఘాల నాయకులు

జంగారెడ్డిగూడెం: 2024-25 వర్జీనియా సీజన్‌కు బ్యారన్ ఒక్కింటికి రూ.9 లక్షలు పంట రుణం ఇవ్వాలని వర్జీనియా రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని యూనియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్, కెనరా బ్యాంక్, కరూర్ వైశ్యాబ్యాంక్‌ల మేనేజర్లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ 2023-24 సీజన్‌లో వర్జీనియా పొగాకు పంటకు ఎకరాకు సుమారుగా రూ.3 లక్షలు ఉత్పత్తి వ్యయం అయ్యిందన్నారు. కావున 2024-25 సీజన్‌కు రుణ పరిమితి పెంచి బ్యారన్ ఒక్కింటికి రూ.9 లక్షలు ఇవ్వాలని బ్యాంక్‌ల మేనేజర్‌లను కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం 2 వేలం కేంద్రాల రైతు సంఘాల నాయకులు సత్రం వెంకట్రావు, అట్లూరి సతీష్, వీవీఎస్ ప్రకాష్‌రావు, వామిశెట్టి హరిబాబు, రైతు నాయకులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు అరికట్టాలి

దెందులూరు: మాతాశిశు మరణాలు నివారించడం ప్రధానమంత్రి సంరక్షణ యోజన పథకం లక్ష్యమని దెందులూరు సీహెచ్‌సీ గైనకాలజిస్ట్ డాక్టర్ షాలిని అన్నారు. ప్రతి నెలా 9న ప్రధానమంత్రి సంరక్షణ యోజనా పథకంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వ వైద్యశాలల్లో పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. మంగళవారం దెందులూరు ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలకు సేవలను అందించారు. ఈ సందర్భంగా షాలినీ మాట్లాడుతూ పరీక్షలు, వైద్య సేవలు పొందే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే భారీ మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. ప్రభుత్వం మాతా శిశు సంరక్షణ పథకం అమలుకు చేస్తున్న కృషికి వైద్య సిబ్బంది చేస్తున్న సేవలకు గర్భిణులు, బాలింతలు పూర్తి సహాయ సహకారాలు అందిస్తేనే సత్ఫలితాలు లభిస్తాయన్నారు.

18 నుంచి కుష్టు నిర్మూలన సర్వే

దెందులూరు: జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18 నుంచి ఆగస్టు 2 వరకు ప్రతి గ్రామ శివారు ప్రాంతంలో ఇంటింటి సర్వే చేస్తామని స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సుధాకర్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా కుష్టు వ్యాధిని చాలా వరకు అరికట్టవచ్చన్నారు. వ్యాధిగ్రస్తులను ముందుగానే గుర్తించవచ్చని వివరించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	24
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	25
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	31
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	16
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	32
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - తిరుపతి	16.00	4830	30